# నాకు తెలీదు

వాడి సంగతులన్నీ నన్నెందు కడుగుతారో? నాతో ఎందుకు చెబుతారో? వాడి జోక్యం నాకసలవసరం లేదు. నేనసలు వాణ్ణి సరిగా ఎరగను.

"వాడు నీ బంధువేటగా" అంటారు- నా బంధువులందర్నీ నేనెరిగినట్టు! కస్త్వం భ్రాతః? మొన్న ఈ మధ్య ఒక అతను మా ఇంటికొస్తే మర్యాదగా కూర్చో బెట్టి "ఏం పనిమీద వచ్చారు? ఏవూరు?" అడిగాను. నేనంత మర్యాదగా మాట్లా డించినా, అతను మొహం మట మట లాడించుకొని, ఏదో గొణుక్కుని లేచి వెళ్ళిపోయినాడు. మొహం ఎక్కడో చూచినట్టుందే అని అనుకున్నానుగాని, ఎంత సేపటికీ తట్టలేదు. ఆఖరుకు మా చెల్లెలి మొగుడి మొహమల్లే ఉందని జ్ఞాపకం వచ్చింది. అతనేనా అన్నంత అనుమానం కూడా కలిగింది. చెప్పొద్దూ ! కాని అతనయితే ఎందుకు వెళ్ళిపోతాడూ? పాపం, ఏం చూచుకుని అతనికింత అహం కారం ఉంటుందీ ? బొత్తిగా లేనివాడు. నాబోటిగాడినుంచి అంతో ఇంతో సహా కారం ఆపేక్షించ దగినవాడు. అటువంటివాడు మాటా, పలుకు లేకుండా లేచివెళ్ళి పోతాడా?....కాని అంత పోలిక ఉండటం - ఉంటారు మనిషిని పోలిన మనుషులు !....

ఈ సీతాపతి- వీడి సంగతి అట్లా కాదే. వీడి మొహం ఎరుగుదును. కన పడితే మర్యాదకు పలుకరిస్తాను. వీడూ నేనూ చిన్నతనంలో పదేళ్ళు కలిసి చదువుకున్నాం కూడాను. అయితే వాడి సంగతేమీ నాకు తెలీదు. నాకు వాడితో పెద్ద పరిచయం ఏమీలేదు. వాడు నన్నెరుగుదునని చెప్పుకుంటే నేనందుకు బాధ్యుణ్ణా? ఎవరెవరో వచ్చి, "నేను నీ మేనత్త మొగుణ్ణిరా, నాయనా !" "నేను మీ పెద్దక్క బావగార్నోయ్!" "నేను మీ పినతల్లి- మామగార్నబ్బాయీ" "నేను నీ పోర్త్ ఫారం క్లాసుటీచర్ని" "నేను నీ మేనమామ కొడుకునిరా ! "నేను నీ పెత్తల్లి కొడుకును!" అంటూ చెప్పుకుంటారు. మొహాలు చూడబోతే అన్నీ కొత్తగా ఉంటై.

పోనీ నేను మొహాలు గుర్తించలేని వాణ్ణా ? చదలవాడ కుమారరాజాగార్ని నేనెప్పుడూ చూడలేదు. ఫోటో కూడా చూచినట్టు జ్ఞాపకంలేదు; కనక చూడలేదనే చెప్పాలి. మరి ఆయన్ని చూడగానే పోల్చుకోగలిగానా?

ఆ మధ్య గిరి[1] గారు ఫలాని టాకీ బహిరంగ ప్రదర్శనానికి వస్తారంటే

---

1. గిరిగారు : వరహగిరి వెంకటగిరి (1894 - 1986) ప్రముఖ జాతీయ వాది, కార్మికోద్యమకారుడు, మాజీ రాష్ట్రపతి.

ఆహ్వానమే తెప్పించుకు మరీ వెళ్ళా. గిరిగార్ని నేనెప్పుడూ చూడలేదు. ఆయన పరిచయ భాగ్యం కోసరమే వెళ్ళాను కూడాను. ఆయన ఫోటో చూడలేదని ఎట్లా చెప్పనూ? చూశాను. కాని గిరిగారికీ ఫోటోకీ ఏమీ సంబంధంలేదు. ఆయన పొట్టిగా సన్నగా ఉంటారు. తలపాగా చుట్టుకుంటారు. వయసు అరవై పై చిల్లర ఉంటై. ఫోటో చూసినవారెవరూ ఆయన్ని చూసి గుర్తించలేరని ఖండితంగా చెప్పగలను. అయినా నేనాయన్ని వెంటనే పోల్చాను.... ఎవరో దేశద్రోహులు ఆ వచ్చినది గిరిగారు కాదనీ, మరొకరనీ అనుకుంటుంటే విన్నాను. తమ నాయకుల్నే గుర్తింపలేని ఈ జనసామాన్యమంటే నాకు మంట కాదూ మరి?—

అందుచేత నేను మొహాలు గుర్తుపట్టలేనననటానికి వీల్లేదు. గాంధీజీని ఎప్పుడో 1924 లో చూశానా, ఇవాళ ఆయన్ని చూసి క్షణంలో గుర్తించగలను.

ఈ సీతాపతి నన్ను ఆర్నెల్లు పోషించానని అందరితోటీ చెప్పుకుంటున్నట్లు విన్నాను. ఇది నేను సహించను. వాడికెప్పుడో గట్టిగా బుద్ధి చెబుతాను. ఈ బికారి వెధవ నన్ను పోషించడమేమిటి ? నా వ్యాపారం మీద ఒక గంటలో వచ్చే లాభమంత లేదు, వాడి నెల ఖర్చు. వాడి జన్మలో ఎన్నడైనా బీడీ తప్ప కాల్చి ఎరుగునా ? నన్ను వీడు పోషించటమేమిటి? ఎవడైనా వింటే నవ్వి పోతాడు.

పోనీ నేనేమైనా ఇటువంటి విషయాలు మరిచే మనిషినా ? ఎప్పుడో నేనింటర చదువుతున్న రోజుల్లో శేషాచలానికి ఒక పావలా బదులిచ్చాను. అది అతను తిరిగి ఇచ్చేసినట్లు చెప్పాడు, తరవాత అడగ్గా. ఇచ్చేసే ఉంటాడు కూడాను. చెప్పొచ్చిందేమంటే నాది చెడ్డ జ్ఞాపకశక్తి. చచ్చినా మరవను. అటువంటిది ఈ సీతాపతిగాడు నన్నారు నెల్లు పోషిస్తే నాకు జ్ఞాపకం ఉండదా ?

అసలు మేమిద్దరము కలిసిఉన్న దెప్పుడూ ? ఎక్కడా ? 1936 లో ఒక గది తీసుకుని వాడు జార్జి టవును సందుల్లో ఉండేవాడు. అప్పుడు మద్రాసు నాకు కొత్తగనక, బ్రాడ్వేలో నేను కనిపిస్తే,నన్ను వాడు, "ఎక్కడ ఉంటున్నా"వని అడిగితే, సామాను సత్రంలో పెట్టుకుని గదికోసం వెతుకుతున్నాననీ, ఉద్యోగం కోసం మద్రాసు వచ్చాననీ నేను చెప్పితే, వాడు నన్ను గది దొరికే దాకా తన గదిలోనే ఉండమని అంటే, పోనీ వాడికీ తోడుగా ఉంటుందిగదా అని సరే నన్నా. దగ్గిరగదా అని వాడు తినే హోటలుకే నేనూ వెళ్ళేవాణ్ణి. సినిమాలకు వాటికి కలిసి వెళ్ళేవాళ్ళం.

సీతాపతిది నక్క తెలివని ఒప్పుకుంటాను. వాడికెంత ముందాలోచనో ! నాకు హోటలు టిక్కెట్లు కొనిపెట్టేశాడు. తాను బీడీలుకొన్నా నాకు సిగిరెట్లు పెట్టె కొనిపెట్టేవాడు. తన డబ్బుతో నన్ను సినిమాకు తీసుకెళ్ళేవాడు. నన్ను పోషించానని చెప్పుకునేటందు కివన్నీ చేస్తున్నాడని నాకేం తెలుసూ? పైగా ఆరు నెల్లని చెబుతున్నాడా? ఫిబ్రవరీలో నేను పట్నంవస్తే ఆగస్టుకల్లా నాకు ఉద్యోగం దొరకనే దొరికింది గద !....

ఈ సీతాపతి ఎవరో నాకు తెలీదు. వీడి ఊసెత్తకుండానే నా జీవితం హాయిగా వెళ్ళిపోతుంది. వీణ్ణిగురించి అరక్షణం కూడా వేదన పడవలిసిన అవసరం నాకులేదు. అయినా పోనీగదా, కష్టంలో ఉన్నాడుగదా, చెడుసావాసాలు చేస్తున్నాడు గదా, మంచిదారిని పెడదామనీ, ఆదుకుందామనీ, ఇంత రాబడి ఏర్పాటు చేద్దామనీ, నేను ప్రయత్నించిన మాట నిజమే. నేనల్లా కోరిందేమంటే - అదయినా వాడి మంచికోరేగాని - నాకేమో జరుగుతుందని కాదు - ఆ దేశద్రోహుల సావాసం మానమన్నా. "నీకీకూలివాళ్ళ సంఘాలెందుకు? దొంగ మార్కెటు వాళ్ళెట్లా పోతే నీకేం? జమీందార్లమీద కత్తిగట్టే పాటివాడివా? ఎంత గొప్పవాడివైనా అణకువ తెచ్చిపెట్టుకో. గాంధీజీకీ, సర్దారు పటేలుకూ, నెహ్రూకూ తెలీని రాజకీయాలు నీకు తెలుసునంటే ఎవరన్నా నవ్విపోతారు. నిన్ను చూసి అంతా ఎంత నవ్వుతున్నారో నీకు తెలుసునా ?........ ఇవన్నీ వొదిలేసుకుని నా దగ్గిరకిరా, నీకు, ఉద్యోగం ఇస్తా" అన్నాను.

రోగికి పథ్యం ఎక్కడన్నా రుచిస్తుందా? నన్ను నానా మాటలూ అన్నాడు. నేను నా కూలీల రక్తం పీలుస్తున్నానుట. వాళ్ళ డొక్కకొడుతున్నానుట. వాళ్ళు తనమాట వింటారుట. వాళ్ళచేత సమ్మె చేయించి నేను తినేదంతా కక్కిస్తాట్ట. నావంటి వాళ్ళలో విశ్వాసం ఉంచబట్టే కాంగ్రెసు నాయకుల రాజకీయాలు అడివిదారి పట్టినాయిట! తాను పనివాళ్ళ పక్షం ఉంచబట్టే తనని కొనెయ్యాలని నేను చూస్తున్నానుట. తనలో సహం చదువులేని వాడికి నా ఫ్యాక్టరీలో చీఫ్ ఫోర్మన్ ఉద్యోగం ఇచ్చి రు. 350లు జీతం ఇస్తున్నాను అతనికి. పాపం, పనివాళ్ళంటే ఏమీ ఆపేక్ష లేదు. ఎంతో స్వామిభక్తి పరాయణుడు. కూలీ వెధవల్ని వెనకేసుకొచ్చిన వాళ్ళం దరికీ ఉద్యోగాలిస్తే నేను అడుక్కు తినవలసిందే!

అడ్డమైన వాళ్ళతోటీ తిరిగి ఇటువంటి త్రాష్టులు "దొంగ వ్యాపారం, దొంగ వ్యాపారం" అంటే నా వొళ్ళు మండిపోతుంది. దొంగ వ్యాపారం అనగా ఏది? ఆర్థికశాస్త్రం బట్టి లేని వస్తువులకి ధర హెచ్చటం ధర్మం. ధరలు ఇష్టమై ఇవ్వగల వాళ్ళే కొంటారు. ధరలు ఇవ్వగల వాళ్ళనుబట్టే హెచ్చుతై. కొనుక్కోలేని వాళ్ళ కోసం వ్యాపారం చేస్తామా? కొనుక్కోలేనివాళ్ళు ఎప్పుడూ ఉంటారు. ఏ ధరలకి వ్యాపారం చేసినా దొంగ వ్యాపారమే. పరప్రభుత్వం ఉండబట్టే ఈ కంట్రోళ్ళన్నీ వచ్చినై.

నేను దొంగ వ్యాపారం చేసి లక్షలు చేసుకున్నానని ఈ సీతాపతి - నా ముక్కూ మొహమూ ఎరుగని ఈ దరిద్ర నాయకుడు - నామీద ప్రచారం చేస్తున్నాడు. అవును, వ్యాపారం చేసుకున్నాను. సంపాయించాను. తనకు చాతయితే సంపాదించుకోలేకపోయినాడా? నామీద పడి ఏడవటం దేనికి? నేను లక్షలు సంపాదిస్తే కట్టుకుపోయినానా? పరిశ్రమ సాగిస్తున్నాను. నలుగురికి భృతి ఏర్పాటు చేస్తున్నాను. వాళ్ళు తిండి తిని పోతున్నారే అని ఏడుపు తనమూ! వారిచేత సమ్మెలు

చేయిస్తాట్ట, కూలివాళ్ళు ఆ కాస్త తిండి తినిపోతున్నారని పీడి ఏడుపు ఓర్చ లేనమ్మ తను పెటడు. అడుక్కో తిననివ్వడు. అందర్నీ దొంగ వ్యాపార్లనీ ప్రజాద్రోహు లనీ తిట్టే ఈ పాకనెప్పుడైనా చూడండి - వీళ్ళు ఒక ఈగకి పని చూపించలేరు. పనిచేసే వాళ్ళని ఇంత తిననివ్వరు. సంఘాలంటారు. సమ్మెలంటారు.

వాళ్ళనని తప్పేమిట్లే? ఈ కూలి వెధవలు కూడా వాళ్ళనే నమ్ముతారు. పెట్టే చెయ్యే కరిచే కుక్కలు వాళ్ళు. వాళ్ళకి చదువా, సంధ్యా? వాళ్ళకు మన మాటలెందుకు నచ్చుతాయి? ఈ సీతాపతి వంటి వాళ్ళే వాళ్ళకు నచ్చుతారు.

లేదు - నాకి సీతాపతి ఎవరో తెలీదు. తెలియవలసిన అవసరం కూడా నాకు లేదు. వాళ్ళు నన్నెరుగుదునని చెప్పుకుంటే నేనందుకు బాధ్యుణ్ని కాను. అట్లా గొప్పగా ఉంటుందని చెప్పుకుంటే చెప్పుకోనివ్వండి. నన్నెరుగుదునని చెప్పుకునే వాళ్ళెంత మంది లేరు గనక?

—ముద్రణ : అభ్యుదయ, అక్టోబరు 1948